# ఫండ్ ఫూలింగ్ ఇప్పట్లో వద్దు

- నిధుల సేకరణపై హెచ్ఎండీఏ తర్జనభర్జనలు
- గతంలో 20వేల కోట్ల నిధుల సేకరణకు ఏజెన్సీల నియామాకం
- ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పునరాలోచనలో హెచ్ఎండీఏ




సిటీబ్యూరో, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ): ప్రాజెక్టుల కోసం నిధుల సేకరించాలని భావించిన హెచ్ఎండీఏ వెనకడుగు వేస్తోంది. పెండింగ్, కొత్త ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు రూ.20వేల కోట్ల ఫూలింగ్ చేసేందుకు ఏజెన్సీలను నియమించుకున్నది. కానీ నిధుల కోసం జరుగుతున్న వివాదాలు, ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకత వంటి అంశాలతో పునరాలోచనలో పడ్డారు. దీంతో ఆ జోలికి వెళ్లకపోవడమే మంచిదనే అభిప్రాయంతో ఉన్నతాధికారులు ఉన్నారు. గతంలో ఉన్న భూములను వేలం వేయాలని భావించినా.. రియల్ ఎస్టేట్ మార్కెట్ అధ్వాన్నంగా ఉండటంతో విరమించుకున్నట్లు తెలిసింది. తాజాగా ఇదే జరగనుండటంతో ప్రభుత్వం అయినా నిధులివ్వాలి. హెచ్ఎండీఏ రెవెన్యూ అయినా పెరిగితే గానీ ప్రాజెక్టులు చేపట్టేందుకు అవసరమైన ఫండ్ సర్దుబాటు చేసుకునే వీల్లేకుండా పోయింది. 11 జిల్లాలకు విస్తరించిన హెచ్ఎండీఏకు గత పదేళ్లలో నిధుల సమీకరణ, ఆర్థిక వనరులను సమకూర్చుకున్నది. ఏనాడూ అప్పులు చేసి కొత్త ప్రాజెక్టులు చేపట్టింది లేదు. కానీ ఏడాదిగా పరిస్థితులన్నీ తారుమారైయ్యాయి. రెవెన్యూ తగ్గిపోవడం, రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో చేపట్టిన, ప్రతిపాదిత ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోతుంది. ఇందుకు ఓ ఆర్థిక సంస్థను నియమించుకుని, హెచ్ఎండీఏ ఆస్తులను తనాఖా పెట్టాలని భావించింది. ఇందులో భాగంగా ఏకంగా రూ.20వేల కోట్లు సమీకరించాలని ప్రణాళికలు రూపొందించింది.

### ఆదాయం తగ్గి...

ఇటీవల భవన నిర్మాణ అనుమతుల ద్వారా వచ్చే ఆదాయం తగ్గిపోయింది. దీంతో అధిక మొత్తం నిధుల సర్దుబాటు చేసుకోవాలని భావించింది. ప్లానింగ్ విభాగం సేకరించే నిధులకు అదనంగా భూముల వేలం, డెవలప్‌మెంటల్ యాక్టివిటీతో హెచ్ఎండీఏ ఖజానా నిండుకునేది. కానీ పరిస్థితి తలకిందులైంది. ఆదాయం ఏకంగా 50శాతానికి పడిపోయింది. దీతో నిర్వహణ, జీతభత్యాలు మినహా కొత్త ప్రాజెక్టులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రతిపాదిత ప్రాజెక్టులను కూడా పూర్తి చేయలేని పరిస్థితి ఉంది. హైదరాబాద్ కేంద్రంగా పెట్టుబడులు పెరిగితే గానీ అదనపు ఆదాయం సమకూరే పరిస్థితి లేదు. పెట్టుబడులను ఆకర్షించే వీల్లేకపోవడంతో.. నిధుల కోసం దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు ఎలివేటెడ్ కారిడార్ పనులు ఇప్పటికీ పట్టాలెక్కలేదు. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ అనుసంధానం చేసేలా కొత్తగా ప్రతిపాదించిన లింకు రోడ్ల నిర్మాణం, ఓఆర్ఆర్ లోపల రోడ్ల నిర్మాణం వంటి ప్రాజెక్టులు అదనపు భారంగా మారేలా ఉన్నాయి.

### కోలుకోలేని మార్కెట్..

ఏడాదిన్నర గడిచిన మార్కెట్ కోలుకోకపోవడంతో... నిధుల సమీకరణపై హెచ్ఎండీఏ పునరాలోచనకు కారణమైంది. ప్రస్తుత ప్రతిపాదిత ప్రాజెక్టులను చేపట్టడానికి కనీసం రూ.15-20వేల కోట్లు ఖర్చు అవుతుందనే అంచనాలు ఉన్నాయి. వీటి కోసం ఆస్తులను తనాఖా పెట్టడం, లేదా భూముల వేలం నిర్వహణ కోసం ఏజెన్సీ నియామాకం జరిగినా... క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులు, మార్కెట్ ప్రతికూలతలతో ఆశించిన మొత్తంలో నిధుల సమీకరణ సాధ్యం కాదనే అంచనాలు ఉన్నాయి.

## గ్రూప్-1 స్టేట్ ఐదో ర్యాంకర్ కు అభినందన


కృత్తికను అభినందిస్తున్న మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్ పేట్, ఏప్రిల్ 1: మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ సిద్దాల లావణ్య, బీరప్పల కుమార్తె కృత్తిక గ్రూప్-1 పరీక్షలో ఐదో ర్యాంకు సాధించింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి వారి నివాసానికి వెళ్లి కృత్తికను ఘనంగా సత్కరించారు. బిడ్డను బాగా చదివించినందుకు తల్లిదండ్రులకు అభినందనలతో పాటు సన్మానించారు. కృత్తిక కష్టానికి ఫలితం లభించిందని అన్నారు. భవిష్యత్తులో ఉన్నతమైన పదవిని చేపట్టబోతుండటం గర్వంగా ఉందన్నారు. కష్టపడితే ఫలితం ఎప్పుడైనా వస్తుందని కృత్తిక రుజువు చేశారని ఆమె అన్నారు. ఈ ప్రాంతానికి కృత్తిక ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే వాళ్ళు కృత్తిక సలహాలు సూచనలు తీసుకోవాలని తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో అర్కల కామేష్‌రెడ్డి, అర్దల భూపాల్ రెడ్డి, విజయలక్ష్మి, భూపేష్ గౌడ్, శ్రీనునాయక్, అంజయ్య, రాజేందర్ రెడ్డి, జలాల్పూర్ సునీత బాలరాజ్, తదితరులు ఉన్నారు.



## అర్షద్ అలీ ఖాన్‌కు కేటీఆర్ పరామర్శ

సిటీ బ్యూరో, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): మహ్మద్ అర్షద్ అలీఖాన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. అర్షద్ అలీఖాన్ తండ్రి నవాబ్ మహ్మద్ ఖుర్షిద్ అలీఖాన్ ఇటీవల మరణించారు. మంగళవారం అర్షద్ ఇంటికి వెళ్లిన కేటీఆర్ ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఖుర్షిద్ ఖాన్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎంపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆజమ్ అలీ, మసీ ఉల్లాఖాన్, మొయిద్, బాదర్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## 'జీవితాన్ని సార్థకం చేసుకోవాలి'

భూధాన్ పోచంపల్లి, ఏప్రిల్ 1 : జ్ఞానం, భక్తి, ధర్మనిష్ట విషయాలను పాటించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని నంద్యాల జిల్లా చాగలమర్రి పూజ్య వేదాంత ఆచార్యులు అభినవ శంకరానందస్వామి అన్నారు. పట్టణంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ఆధ్యాత్మిక భక్త సమాజం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆత్మజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. సకల జీవరాసుల్లో మానవ జన్మ అతి పవిత్రమైందన్నారు. ఆత్మజ్ఞానం లేకపోవడంతో అనర్థాలకు కారణం అవుతున్నారని తెలిపారు. సకల వేద శాస్త్రాల్లోని సారాన్ని తెలుసుకోవాలని, జ్ఞానం గొప్పదనాన్ని సద్గురువుల ద్వారా విని ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సీత సత్యనారాయణ, ఆధ్యాత్మిక భక్త సమాజం అధ్యక్షుడు భారత పురుషోత్తం, గౌరవాధ్యక్షుడు కటకం తుకారాం పాల్గొన్నారు.

# ఆస్తిపన్ను వసూళ్లు రూ.2038 కోట్లు

- గతేడాది కంటే రూ.121.42 కోట్లు అధికం
- అత్యధికంగా శేరిలింగంపల్లి, అత్యల్పంగా చార్మినార్ జోన్
- సమిష్టి కృషితోనే అద్భుతమైన వసూళ్లు: జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

**జోన్ల వారీగా ఆస్తిపన్ను వసూళ్ల వివరాలు**

| జోన్ | చెల్లింపుదారుల సంఖ్య | వచ్చిన ఆదాయం (రూ.కోట్లలో) |
|---|---|---|
| ఎల్బీ నగర్ | 243692 | 287.04 |
| చార్మినార్ | 163869 | 150.44 |
| ఖైరతాబాద్ | 220763 | 530.09 |
| శేరిలింగంపల్లి | 248549 | 447.78 |
| కూకట్‌పల్లి | 271595 | 331.43 |
| సికింద్రాబాద్ | 259750 | 291.64 |
| | 1408218 | 2038.42 |

సిటీబ్యూరో, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ప్రధాన ఆర్థిక వనరైన ఆస్తిపన్ను వసూళ్లలో గత ఏడాది గణంకాలను అధిగమించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1917 కోట్లు వసూలు కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.2038.42 కోట్లు వసూలైందని కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. జీహెచ్ఎంసీ చరిత్రలోనే మొదటి సారి 14 లక్షల మందికి పైగా పన్ను చెల్లించడం ద్వారా అద్భుతమైన వసూళ్లను సాధించిందన్నారు. గత నెల 7వ తేదీన బకాయిదారులకు వన్ టైం సెటిల్‌మెంట్ స్కీంను ప్రభుత్వం అవకాశం కల్పించగా.. ఓటీఎస్ రూపంలో దాదాపు రూ.470 కోట్ల వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదనపు కమిషనర్ అనురాగ్ జయంత్, చీఫ్ వ్యాల్యుయేషన్ అధికారి (సీవీఓ) కులకర్ణి ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిల వసూళ్లు సమిష్టి కృషితో సులభతరమైందని చెప్పారు. బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ల సహకారం, డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర పన్నుల విభాగం, ఐటీ, ఆర్థిక విభాగాలు కీలకమైన పాత్ర పోషించాయని కమిషనర్ పేర్కొన్నారు. కాగా 30 సర్కిళ్లకు గానూ అత్యధికంగా శేరిలింగంపల్లిలో రూ.288.14కోట్లు, జూబ్లీహిల్స్ సర్కిల్‌లో రూ.190 కోట్లు, ఖైరతాబాద్‌లో రూ.173.65కోట్లు , అత్యల్పంగా ఫలక్‌నుమా సర్కిల్‌లో రూ.12.51కోట్లు వసూలైంది.

## సన్న బియ్యం కాదు... సానపట్టిన బియ్యం

**చెన్నాపురం రేషన్ షాపులో మహిళల మండిపాటు**

**పేదలందరికీ సరిపడేలా సన్నబియ్యం పంపిణీ చేయాలి**


చెన్నాపురం రేషన్ షాపులో సానపట్టిన బియ్యమంటూ చూపిస్తున్న మహిళ

జవహర్‌నగర్, ఏప్రిల్ 1: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన సన్నబియ్యం పథకంలో సన్న బియ్యం లేవని.. సానపట్టిన బియ్యమంటూ చెన్నాపురంలోని రేషన్ షాపులో మహిళలు మండిపడ్డారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని పలు రేషన్ షాపుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని మంగళవారం అట్టహాసంగా ప్రారంభించింది. ఈ సందర్భంగా చెన్నాపురంలోని రేషన్ షాపులో బియ్యం తీసుకున్న మహిళలు మాట్లాడుతూ సన్నబియ్యం కాదనీ.. సానపట్టిన బియ్యమంటూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మిల్లర్ల వద్ద దొడ్డు బియ్యాన్ని పాలీష్ చేసి సన్నబియ్యంగా మారుస్తూ పేదలను మోసం చేయాలని చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# గద్దర్ వ్యక్తి కాదు.. వ్యవస్థ

**గద్దర్‌పై కాల్పులు జరిపిన నిందితుల పడలేదు: ప్రెస్‌అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ**

రవీంద్రభారతి, ఏప్రిల్1: జననాట్యమండలి వ్యవస్థాపకుడు, ప్రజాయుద్ధనౌక గద్దర్ గొప్ప వ్యక్తి అని, గద్దర్ తన ఆట, పాటలతో తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేశాడని.. ఆయన ఒక వ్యక్తికాదని వ్యవస్థ అని మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. 1997 ఏప్రిల్ 6 న గద్దర్‌పై కాల్పులు జరిపిన రోజును పురస్కరించుకొని మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ప్రశ్నించే గొంతులు-పాలకుల అణచివేత' సభ పోస్టర్ ను ముఖ్యఅతిథిగా హాజరైన అల్లం నారాయణ, గద్దర్ కుమారుడు సూర్యం, బెల్లయ్యనాయక్ తదితరులు ఆవిష్కరించారు. అల్లం నారాయణ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలను పాలకులు అణచివేస్తున్నారని, ఆనాటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్రబాబు హయాంలో గద్దర్‌పై గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరిపి ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ దోషులను పట్టుకొని శిక్షించలేదని విమర్శించారు. విప్లవోద్యమంలో ఆదివాసీ, పేదల కోసం జీవితాన్ని త్యాగం చేసి, తన ఆట, పాట ద్వారా ప్రజలను చైతన్యం చేస్తుంటే.. సహించలేక గద్దర్‌పై కాల్పులు జరిపారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో నైనా దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 6న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే 'ప్రశ్నించే గొంతుక-పాలకుల అణచివేత' కార్యక్రమాన్ని ప్రజలు, మేధావులు, ప్రజా, విద్యార్థి సంఘాలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సూర్యం

# సత్వరమే సమస్య పరిష్కారం కోసం..

**డిస్కం ఆటోలకు జీపీఎస్..**

**ఆటోల పనితీరుపై మానిటరింగే ప్రధాన లక్ష్యం**




సిటీబ్యూరో, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ): దక్షిణ డిస్కం పరిధిలో ఎక్కడ ఏ చిన్న అంతరాయం ఏర్పడినా వెంటనే పరిష్కరించడానికి ఆటోలను సరికొత్తగా రూపొందించారు. ఇంతకుముందు ఉన్న ఆటోలు సమస్య వచ్చినప్పుడు వెంటనే స్పందిస్తున్నాయో లేదో తెలియకపోవడంతో ఎస్పీడీసీఎల్ సిబ్బందికి, ఉన్నతాధికారులకు వినియోగదారుల నుంచి వ్యతిరేకత పెరిగింది. ఈ పరిస్థితి నుంచి బయటపడడానికి ఎఫ్ఓసీ (ఫ్యూజ్ ఆఫ్ కాల్) సెంటర్లకు ఫిర్యాదులు రాగానే తక్షణమే అక్కడకు వెళ్లేలా ఎఫ్ఓసీ పరిధిలో ఉన్న ఆటోలకు జీపీఎస్‌ను అనుసంధానించారు. ఇప్పుడు ఆ ఆటో ఎక్కడికి వెళ్లినా వెంటనే తెలిసిపోయేలా అన్ని ఆటోలను ఒకే తరహాలో డిజైన్ చేసి వాటిని చూడగానే ఎస్పీడీసీఎల్ వాహనాలుగా గుర్తించేలా రూపొందించారు. సీఎండీ ముషారఫ్ ఫరూఖి ఆదేశాల మేరకు ప్రతీ సెక్షన్‌లో ఉన్న ఆటో రూపురేఖలు దాదాపుగా మార్చారు. మిగిలినవి వారంలో అందుబాటులోకి వస్తాయని అధికారులు చెప్పారు. జీపీఎస్‌కు అనుసంధానం చేయడం ద్వారా వీటిని విద్యుత్ కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఆటోల పనితీరుపై చాలా ఆరోపణలున్నాయి. వ్యక్తిగత పనులకు వినియోగించారన్న విమర్శలు ఉన్నాయి. వీటన్నిటికి చెక్‌పెడుతూ ఫిర్యాదులపై వెంటనే స్పందించి సమస్య పరిష్కారం చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉన్నతాధికారులు చెప్పారు.

### ఒకే తరహాలో 247 ఆటోలు..

గ్రేటర్ పరిధిలోని 10 సర్కిళ్లలో ఉన్న ఎఫ్ఓసీలలో 247 ఆటోలున్నాయి. ఇందులో అత్యధికంగా సంగారెడ్డి సర్కిల్‌లో 38, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లో 29, హబ్సిగూడ సర్కిల్‌లో 28, రాజేంద్రనగర్‌లో 25, హైదరాబాద్ సౌత్‌లో 25, సరూర్‌నగర్‌లో 24, మేడ్చల్‌లో 23, సికింద్రాబాద్‌లో 22, సైబర్‌సిటీ సర్కిల్‌లో 19, బంజారాహిల్స్‌లో 14 ఆటోలు ఉన్నాయి. వీటన్నిటికి జీపీఎస్ అనుసంధానం చేయడమే కాకుండా సంస్థ లోగో, టోల్‌ఫ్రీ నంబర్ 1912ను రాయించారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే ఎఫ్ఓసీ పరిధిలో ఉండే ఆటోలను జీపీఎస్ ద్వారా ఎక్కడున్నాయనే విషయాన్ని గుర్తించి దగ్గరలో ఉన్న టీమ్‌కు సమాచారం అందించడం ద్వారా వినియోగదారులకు సత్వర సేవలు అందించగలుగుతామని సీఎండీ చెప్పారు. ఇక సేవల్లో వేగం పెంచడానికి మరో అడుగు ముందుకేస్తున్నట్లు ముషారఫ్ పేర్కొన్నారు.

## ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మేకల మధుసూదన్ రెడ్డి

ఉప్పల్, ఏప్రిల్ 1: ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ (ఫ్లైఓవర్) పనుల జాప్యంపై ఏప్రిల్ 4న ఉప్పల్ గాంధీ బొమ్మ వద్ద శాంతియుత నిరసన విజయవంతం చేయాలని ఉప్పల్ గ్రామ పెద్దలు పిలుపునిచ్చారు. మంగళవారం ఉప్పల్ గ్రామ పెద్దలు, వర్తక సంఘం ప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు సన్నాహక సమావేశం నిర్వహించారు. నిరసన కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని గ్రామ ప్రతినిధులు మేకల మధుసూదన్ రెడ్డి, మేకల హనుమంత్ రెడ్డి, బజారు జగన్నాథ్ గౌడ్, గోనె అర్జున్ రెడ్డి , బిక్కుమల్ల రమేష్, గిరి రామకృష్ణ కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుబ్బ నరసింహారెడ్డి, మేకల శివారెడ్డి, బీజేపీ నాయకులు శామీర్‌పేట ధర్మారెడ్డి, మహంకాళి లక్ష్మణ్ ముదిరాజ్, శ్రీనివాస్ శర్మ, ఫణీంద్ర, నర్సిరెడ్డి, మేకల దయాసాగర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నేర్థం భాస్కర్ గౌడ్, జల్లి మోహన్, పూడూరి జితేందర్ రెడ్డి, పంగ మహేందర్ రెడ్డి, బింగి భరత్ గౌడ్, పంగ రాజేశ్వర్ రెడ్డి, పోగుల సోమిరెడ్డి, సత్యరాజ్ గౌడ్, కాయ హనుమంత్, ముదిగొండ జగన్, నవీన్ గౌడ్, నరేంద్ర చౌదరి, జహంగీర్, గ్రామస్తులు జగదీశ్వర్ రెడ్డి, మేకల రామ్ రెడ్డి, మేకల సంతోష్ రెడ్డి, మహంకాళి నరసింహ ముదిరాజ్, కల్లూరి వేణు, గిరి చక్రధర్, సుప్రీత్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## 5న నోటరీ అడ్వకేట్ల రాష్ట్ర స్థాయి సమావేశం

బన్సీలాల్ పేట్, ఏప్రిల్ 1: నోటరీ అడ్వకేట్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఏప్రిల్ 5న రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని తెలంగాణ అడ్వకేట్ నోటరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంజి యాదగిరి, కార్యదర్శి మయబ్రహ్మ నరసింహ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖలో అధికారికంగా నమోదు అయిన్న నోటరీ అడ్వకేట్లు రాష్ట్ర, జిల్లా స్థాయి న్యాయస్థానాల వద్ద ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ముషీరాబాద్ చౌరస్తా సమీపంలోని భోలక్ పూర్ లోని ఎవర్ గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో 5న ఉదయం 10 గంటలకు సమావేశం అవుతున్నట్లు పేర్కొన్నారు. అన్ని జిల్లాల నుంచి నోటరీ అడ్వకేట్లు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## ముగిసిన ఉగాది వసంతోత్సవాలు

కొండాపూర్, ఏప్రిల్ 1: ఉగాది వసంతోత్సవాల్లో భాగంగా మాదాపూర్ లోని శిల్పారామంలో మంగళవారం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు కళాకారుల కూచిపూడి, కథక్ నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. నాట్యవేద కళాక్షేత్రం నిర్వాహకులు పరంజ్యోతి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో శ్రీ విఘ్న రాజాం భజే, అయిగిరినందిని, మూషిక వాహన, గోవర్ధన గిరిధారి, వెడలెరా వయ్యారాలు,అదిగో అల్లదిగో, జతిస్వరం, రామచంద్రయ్య , శివాష్టకం అంశాలను శివాని నిహరిక, హరిణి, అభిరాం, నైనా, చిన్మయి, ఆశ్రిత, సహస్రలు ప్రదర్శించి మెప్పించారు. అనంతరం శ్రీవల్లిరావు శిష్య బృందం కథక్ నృత్య ప్రదర్శనలో గణేశా వందన, గురు వందన, శివ వందన, తుమ్మేటి, తరణ అంశాలను శివరాజ్, అక్షిత, రేఖ, హాసిని, శ్రీవల్లి, యుతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి.

## ఇంటికే రాములోరి తలంబ్రాలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 1 ( నమస్తే తెలంగాణ): ఏప్రిల్ 6న శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలం సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలు కావాలనుకునే భక్తులకు నేరుగా వారి ఇంటికే చేర్చేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ నెల 6 వరకు కూడా తలంబ్రాలు బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ కేంద్రాలతో పాటు సంస్థ వెబ్‌సైట్‌లో రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆన్‌లైన్ బుకింగ్‌తో పాటు కాల్ సెంటర్లు 040-69440069, 040-69440000 ను సంప్రదించి సేవలు పొందొచ్చని వివరించారు. నగరవాసులు ఈ సేవలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

## వడదెబ్బ తో గుర్తుతెలియని వ్యక్తి మృతి

మియాపూర్, ఏప్రిల్ 1: వడదెబ్బతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మియాపూర్ పోలీసులు మంగళవారం ప్రకారం.. మియాపూర్ మదీనాగూడలో స్టీల్ దుకాణం ఎదుట అపస్మారకస్థితిలో ఉన్న వ్యక్తిని గుర్తించిన దుకాణ నిర్వాహకుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారి సహకారంతో అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సంగారెడ్డి దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## భూములను అక్రమించాలని చూడడం సిగ్గుచేటు

మియాపూర్ , ఏప్రిల్ 1: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరుగుతున్న ధర్నాకు అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి హాజరై రాష్ట్ర కమిటీ తరపున సంఘీభావం, మద్దతు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో భూముల వేలాన్ని ఆపాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు జేసీబీని అడ్డుకుంటూ విద్యార్థులు చేస్తున్న ఆందోళనను విచ్చిన్నం చేసి అక్రమ అరెస్టులు చేయడం హేయమైన చర్య అని అరెస్ట్ చేసిన యూనివర్సిటీ విద్యార్థి సంఘ నాయకులను తక్షణమే విడుదల చేయాలని ఏ ఐ ఎఫ్ డీ ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి డిమాండ్ చేశారు.

## ఫిజిక్స్ ఒలంపియాడ్‌లో ధనుశ్‌రెడ్డికి ప్రథమ బహుమతి


ధనుష్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

అడ్డగూడూరు, ఏప్రిల్ 1 : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గత నెలలో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ నిర్వహించిన ఫిజిక్స్ ఒలంపియాడ్‌లో నల్లగొండ జిల్లా కేంద్రంలోని అరబిందో పబ్లిక్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న బైరెడ్డి ధనుష్‌రెడ్డి ప్రథమ బహుమతి సాధించాడు. ధనుష్‌రెడ్డిని గ్రామస్తులు మంగళవారం సన్మానించారు. తల్లిదండ్రులు బైరెడ్డి నర్సిరెడ్డి, శిరీష, గ్రామస్తులు ధనుష్ రెడ్డిని అభినందించారు.

## 'భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సోములు

రామన్నపేట, ఏప్రిల్ 1 : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొరిగె సోములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులన్నింటనీ కార్మికుల కోసం ఖర్చు చేయాలన్నారు. కొత్త లేబర్ కార్డులు ఇవ్వాలని, రెన్యూవల్‌లో వస్తున్న ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తరిగొప్పల వెంకట్‌రెడ్డి, రాసాల రమేష్, నాయకలుఉ ఆదిమల్లేశ్, చెన్నయ్య, సైదులు, రాజు, నాగరాజు పాల్గొన్నారు.

## మొరిగాడి వెంకటేశ్వర్లుకు సత్కారం


వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఆలేరు పట్టణ ప్రముఖులు

ఆలేరు టౌన్, ఏప్రిల్ 1 : ఆలేరు పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు మొరిగాడి వెంకటేశ్వర్లును ఇటీవల తమిళనాడు రాష్ట్రం హోసూరులో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ విశ్వవిద్యాయలం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. మంగళవారం ఆలేరుకు చెందిన వివిధ పార్టీల నాయకులు, గౌడ కులస్తులు, ప్రముఖులు వెంకటేశ్వర్లును శాలువాతో సన్మానించి అభినందించారు. మంగ నర్సింహులు, సుదగాని సత్యరాజయ్య, పంతం కృష్ణ, జింకట రామకృష్ణ, వెంకటేశ్, మహేశ్, శ్రీనివాస్, ఉప్పలయ్య, కృష్ణ, సత్యనారాయణ, లక్ష్మణ్, భాస్కర్, జితేందర్, కుమార్ పాల్గొన్నారు.

## పశుగ్రాసాన్ని దహనం చేసిన దుండగులు

రాజాపేట, ఏప్రిల్ 1 : మండలంలోని దూది వెంకటాపురంలో నకిర్త ఆంజనేయులుకు చెందిన 70 మోపుల పశుగ్రాసాన్ని మంగళవారం గుర్తు తెలియని దుండగులు దహనం చేశారు. అదేవిధంగా స్టార్టర్, బోరు మోటర్, వైరు తగులబెట్టారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు పాపన్నగౌడ్ వర్ధంతి

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 1 : జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30గంటలకు నిర్వహించే కార్యక్రమంలో బీసీలు, ఇతర కుల సంఘాల నాయకులు, ప్రజలు, అధికారులు, పాల్గొనాలని కోరారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 1 : మండలంలోని దంతూరు గ్రామానికి చెందిన సిద్ధగోని మల్లయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా.. వైద్య చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.34వేలు మంజూరయ్యాయి. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును నాయకుడు గోరుగంటి రవీందర్ మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దోటి కుమార్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, చంద్రయ్య, సాయికుమార్, బాలయ్య, నర్సమ్మ, శ్రీశైలం, అనిల్, గోపాల్, శివ, పవన్ పాల్గొన్నారు.